"స్టాపిట్..." ఉక్రోషంగా అరిచాడు రామసూరి "నేనైనా ఏం చేయగలను- శాంతి భద్రతలు కాపాడతానని ప్రజా ప్రతినిధిగా ప్రమాణం చేసిన మంత్రివర్యులే నీతి తప్పి జాతి ద్రోహానికి సిద్ధపడుతుంటే నేకొక్కడ్నే ఏం చేయగలనని.... అడుగడుగునా అవకాశవాదంతో రాజకీయపు రంగులు మారుస్తూ వాస్తవాన్ని వేలంవేసి, సాక్ష్యాల్ని సంతలో పెట్టి పబ్లిక్‌గా అమ్మేస్తుంటే వాటికి ధర కట్టి కొనుక్కునే దమ్ము నాకెక్కడిది" ఓ క్షణం ఆగాడు రొప్పుతూ "మీకు తెలీదు యశస్విగారూ- అసలు రాందేవ్ ఎందుకు పోయాడో తెలుసా... తను అనుమానించిన ఓ రహస్యాన్ని ఛేధించబోయాడు. నేను వద్దూ అని వారిస్తున్నా వినకుండా నిన్నటి అర్ధరాత్రి స్వతంత్రం తీసుకుని మనకొచ్చిన అర్ధరాత్రి స్వతంత్రాన్ని సద్వినియోగం చేసుకోబోయాడు.... ఏ సాక్ష్యాన్ని సేకరించాడో తెలిసిన పోలీసు బలగమూ కళ్ళు మూసుకుంటుంది. ఎంతయినా ఆ కళ్ళులేని చట్టానికి ప్రతినిధులుగా"

"మీరు వారించానన్నారు.... అయినా రాందేవ్ వినలేదు. కాని ఆ విషయాన్ని ఓ సమర్థుడైన జర్నలిస్టుగా మీరు చీకటి సత్యాన్ని ప్రపంచానికి తెలియచెప్పొచ్చుగా".

"అంటే గనికొండలో గోపాలం ఎవరూ, ఆ కుటుంబంలో దళితుల మూలంగా ఎంతమంది పోయారు అంటూ ఇన్వెస్టిగేషన్ చేయాలంటారు- అవునా" నవ్వేశాడు "ఆ పసికందుని బ్రతకనిస్తారా అసలు...."

'పసికందు' అన్న పదం ఓ మిస్సైల్లా దూసుకుపోయింది యశస్వి మెదడులో నుంచి....

"అంటే..... రాందేవ్ అనుమానించింది నానీ విషయంలోనేనా" అనుకొంటూ వెంటనే జేబులోనుంచి ఓ కార్డుసైజు ఫోటో తీశాడు యశస్వి.

భారంగా రెప్పలు వాలిపోతున్న రామసూరి ఆ ఫోటోని ఓ మారు చూసి "యస్. నిన్న ప్రెస్ కాన్ఫరెన్స్‌లో వున్న ఈ అబ్బాయి విషయం లోనే రాందేవ్ ఇన్వెస్టిగేషన్ చేస్తానన్నది. అవునూ- మీకు ఈ అబ్బాయి తెలుసా" అడిగాడు మామూలుగా.

"బాగా తెలుసు- వీడి పేరు నానీ, వీడి వూరు గనికొండ కాదు. అనకాపల్లి దగ్గర తుంపాలనే పల్లెటూరు. వీడు అక్కడ ఓ క్రిమినల్ కేసులో అతి ముఖ్యుడైన సాక్షి. ఒక పోలీసాఫీసరుగా నేను గాలిస్తున్నది. వీడికోసమే."

అప్రతిభుడైన రామసూరి క్షణంలో ఎలర్టయిపోయాడు. "అంటే..."
అదే.... సరిగ్గా అదే క్షణం అతడి మత్తు వదిలించిందీ. గడ్డకట్టిన ఒక జీవనది ప్రవాహంగా మారిందీను- "తప్పుచేసిన ప్రతివాడూ పడే తొందరపాటులో వాడి రాజకీయ చరిత్ర సమాధికి వాడికి వాడే చితిని పేర్చుకున్నాడన్నమాట యశస్వీ... ఒక గడ్డిపోచలాంటి ఆ పసికందు ఏనుగు నడకకి బలమైన సంకెళ్ళు వేశాడు".

యశస్వి ఆ వేడిని చల్లారనివ్వలేదు. "ఒక్కసారి..... కనీసం.... ఈ ఒక్కసారి ఒక నిజం బ్రతకడం కోసం, ఒక సత్యాన్ని బ్రతికించుకోవడం కోసం మీరు మనసు విదిలించుకుని రంగంలోకి దిగండి రామసూరీ! నా పరంగా మీకు కావలసిన సహాయాన్ని అందిస్తాను....".

ఇన్నాళ్ళూ నిషాలో మేధని జోకొట్టిన రామసూరి విజృంభించాడు

--------------

సరిగ్గా అప్పుడే....

మరో అరగంటలో చీఫ్ మినిస్టరుకి 'నానీ' విషయం గురించి. రాందేవ్ మరణానికి సంబంధించిన అనుమానాస్పద పరిస్థితుల గురించి జర్నలిస్టు అసోసియేషన్ తరపున టెలిగ్రాంలు పంపబడ్డాయి.

ఆ రాత్రే ప్రముఖ దినపత్రికల్లో మొత్తం విషయం ప్రచురణమయ్యే ఏర్పాట్లు జరిగిపోయాయి.

"రాందేవ్ హత్యకు మూలకారణం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో నానీని అతడనుమానించడమేనా...." అన్న వార్తతో పాటు దాని పక్కనే "నానీ కనిపించడంలేదు" అంటూ అతడి వివరాలతో ఫోటో పబ్లిష్ కావడానికి ఓ పథకం రూపు దిద్దుకుంది.

* * * *

ఎప్పుడో స్పృహ తప్పిన నానీ కళ్ళు తెరిచేసరికి బాగా చీకటి పడింది.

సమీపంలో వెళ్ళే ఒకటీ అరా కార్ల రొద ఆకలి-కడుపుపై రోకటి పోట్లలా మెలిపెడుతున్నాయి.

పెదవుల అంచున గడ్డకట్టిన రక్తం ఉప్పగా వాంతొచ్చేట్టుగా అనిపిస్తుంటే నెమ్మదిగా లేచాడు.

తూలిపోతున్నాడు.... అయినా నడుస్తున్నాడు.

కళ్ళు మసకలు కమ్ముతున్నాయి.... అయినా చీకటిలో గమ్యమేదో తెలీని దారికోసం వెతుకుతున్నాడు.

ఈ సారి నానీ కోరకుండానే కన్నీళ్ళు సుడులు తిరుగుతూ బయటి కొస్తున్నాయి.

ఆమ్మ పోయాక అతడి చిరు స్వప్నాలకు బాసటగా నిలిచిన నేస్తాలు ఆ కన్నీళ్ళే.

"అమ్మా..... ఆకలేస్తూందే"

అమ్మపాటని మరిచి ఇదే మాటని ఇరవైనాలుగు గంటల వ్యవధిలో ఎన్నిసార్లు అనుకున్నాడో గుర్తులేదు.

నీరసంగా ఓ మూల చెత్తకుండీ దగ్గర చతికిలబడిపోయాడు.

అక్కడికి దగ్గరగా నలుగురు అబ్బాయిలు కూర్చుని అన్నాన్ని వాటాలుగా పంచుకుంటున్నారు.

తల పైకెత్తాడు ప్రాణం లేచివచ్చినట్టు!

ఓ అబ్బాయి ఎంగిలి విస్తరాకుల్లోని అన్నాన్ని ఊడ్చి వో విస్తరిలో వుంచుతుంటే మరో అబ్బాయి అందరిలోనూ పెద్దగా వున్నవాడు మిగతా ముగ్గురికీ పంచుతున్నాడు.

నానీకి నోరూరుతోంది.

అడగడానికి సంశయించేవాడే.... కాని బోలెడంత ఆకలేస్తూంది.

"అన్నం కావాలా" అడిగాడు పెద్దబ్బాయి.

తలూపేడు.

"డబ్బులున్నాయా" ఆకతాయిగా ప్రశ్నించాడు మళ్ళీ.

ఓ మారు పేంటుజేబులు తడుముకుని లేవన్నటు తల అడ్డంగా వూపేడు.

"ఉంటాయి చూడు" ఈ సారి ఆ అబ్బాయి దగ్గరగా వచ్చాడు.

"లేవు.... నిజమే చెప్పాను."

"ఆ చూడుబే" ఓ చేత్తో ఆకు పట్టుకుని రెండో చేతిని నానీ జేబులోకి పెట్టబోయాడు.

"ఇవి డబ్బులు కావు" నిక్కరు జేబులో ఎత్తుగా వున్న రీలుని చూపిస్తూ అన్నాడు.

"మరి"

"నిజం"

"ఏం.... నిజం"

"అతను చచ్చిపోతూ ఇచ్చాడుగా."

"ఆ" విస్మయంగా నోరు తెరిచిన అబ్బాయి "ఏటీ.... అయితే అదేదో చాలా ఖరీదైందే అయ్యుంటాది.... ఇలాతే" అన్నాడు దూకుడుగా .

మరోసారి ఆ నిజంపై వేట మొదలయింది.

నానీ పరుగెత్తాడు బలాన్ని కూడగట్టుకుని.

అతన్ని తప్పించుకోవడానికి అట్టే శ్రమపడకుండానే చౌరస్తాని చేరుకున్న నానీ జంక్షన్‌లో నిలబడి ట్రాఫిక్‌ని అదుపు చేస్తున్న కానిస్టేబుల్‌ని చూడగానే ఆగిపోయాడు.

రాందేవ్ చివరిగా అన్న మాటలు గుర్తుకొచ్చేయి.

"వాళ్ళకి కనిపించకు.... ఈ రీలు పోలీసుల కందించు.... ఇది ఒక నిజాన్ని బ్రతికించే...."

జేబు క్రమంగా బరువెక్కిపోతుంటే వేగంగా రోడ్డు మధ్యగా దూసుకుపోయాడు.

నానీ ఇప్పుడు ఒక జీప్ కభిముఖంగా
నిలబడి వున్నాడు.

జీప్‌లోని హరిని చూస్తూ కట్టెలా బిగుసుకుపోయిన నానీకి, కానిస్టేబుల్‌కి మధ్య దూరం కేవలం పదిహేను అడుగులు మాత్రమే.

నుదుటపట్టిన చెమట కళ్లపైకి జారుతుంటే రెప్పలార్చకుండా హరినే చూస్తున్నాడు.

వెళ్లాలి, పోలీసంకుల్‌కి రీలిచ్చేయాలి.

ఆ!.... అంతే.... నానీ కదలబోయాడు.

హరి జీప్ నెమ్మదిగా దిగాడు.

సరిగ్గా అప్పుడు...

"ఏటిసార్.... హరిబాబు. జీప్‌ని రోడ్ మధ్యలో ఆపేశారు" పళ్ళుకిలిస్తూ కానిస్టేబుల్ హరిని

పలకరించాడు "మరేంలేదు.... ట్రాఫిక్ జామై పోతుందని."

ఈ దృశ్యాన్ని విభ్రమంగా చూశాడు. అదీ అరక్షణంపాటే.

రోడ్డు మధ్యగా నిలబడిన హరి వినయంగా నిలబడిన కానిస్టేబుల్‌కి ఏదో చెబుతున్నాడు.

అంతే..... నానీ గమ్యం మారిపోయింది క్షణాల్లో. 'నిజం' పోలీస్‌లా లేడు. జేబులో రీలుని ఇవ్వకూడదనిపించింది.

కొన్ని సెకండ్ల క్రితం ఏ కానిస్టేబుల్ రక్షణ తన కవసరమనుకున్నాడో ఆ వ్యక్తే శత్రు కూటమివాడే అనిపించడంతో దూకుడుగా పరుగెత్తాడు.

హరి వెంటాడబోయాడు కాని సమయానికి ఏ దేవుడో పంపినట్టుగా ఓ సిటీ బస్సు హరికి అడ్డం వచ్చింది.

"అడుగో బాబు... దొంగ... నం... కొడుకు పారిపోతుండు" కానిస్టేబుల్ నొచ్చుకుంటూ చూశాడు దూరంగా పరుగెడుతున్న నానీనే గమనిస్తూ.

ఆ కానిస్టేబుల్ చేష్టల్లో హరిలాంటి ఓ ప్రముఖుడికి తను అవసరానికి సహాయం చేయలేకపోయానే అన్న బాధ కనిపిస్తూంది తప్ప ఓ పిచ్చుకపైన ఆ బ్రహ్మాస్త్రం ఎందుకు దాడి చేస్తుందీ అన్న మీమాంస లేదు.

అప్పటికే హరి జంక్షన్ దాటి ఓ యాభై అడుగుల దూరం పరుగెత్తాడు.

నానీ జాడలేదు.

కసిగా పిడికిలితో అరచేతిపై గుద్దుకుంటూ వెనుదిరిగి జీపు దగ్గరకు వచ్చాడు.

"బాబూ.... ఏటి.... అయితే ఆడు దొరకలేదా? గుంటడు గట్టోడులా వున్నాడండి" రోడ్డుమీద ట్రాఫిక్ జామైపోయి వుంది హరి జీప్ మూలంగా "బండి బాగుంది బాబూ! కొత్తదేటీ.... అహ.... తమరు పాత బళ్ళు వాడతరేటిగాని! అందుకే ముచ్చటపడి దీన్ని కాపాడేస్తున్నాను" చేతిలో ఓ పది నోటు పడేవరకు స్తోత్రాన్ని కంటిన్యూ చేసి ఆ తరువాత హారన్‌లతో గగ్గోలు పెడుతున్న కార్లని, స్కూటర్లనీ చూస్తూ కసురుకున్నాడు "ఏటి కొంపలు మునిగిపోతున్నట్టు ఆ తొందరేం? కల్చరేటి నేదు యెదవలకి" హరి ముందు తన అణకువని మరింతగా ప్రకటించి, అప్పుడు రోడ్ మధ్యగా నిలబడ్డాడు యిహ తన కర్తవ్యాన్ని నిర్వహించడానికి తీరికయిందన్నట్లుగా.

*　　*　　*　　*

"అమ్మా.... ఆకలమ్మా!"

"కొంచెం అన్నం వుంటే పెట్టమ్మా!"

"మంచమ్మవి కదమ్మా!"

పొగచూరిన ప్రకృతిలా మారి ఆకలితో బక్కచిక్కిన గొంతుతో పదాలను కూడగట్టుకుంటూ నిస్సత్తువగా చేతులు చాచి పిలుస్తున్నాడు నానీ.

తలుపులు తెరుచుకోలేదు.

అయినా తన ప్రయత్నాన్ని మానలేదు.

"అమ్మా! ఆకలమ్మా...." నిస్త్రాణగా పిలుస్తూనే ఉన్నాడు.

"కొంచెం అన్నం పెట్టమ్మా!"

ఎవరూ పలకరేం! ఏ అమ్మకీ జాలి కలగదేం. అమ్మా.... అమ్మా! ఎందుకే చచ్చిపోయావ్. ఇదేంటే, నేను నీకెంత ముద్దొచ్చేవాడ్నే. మరందరికి నేనంటే కోపమెందుకమ్మా!

ఇలాంటి రీతిలో నిలబడే ఓ రోజుంటుందని అపశృతుల బ్రతుకులో అమ్మ అన్న పదాన్నే ఆసరాగా తీసుకుని చేయి చాచి అడుక్కునే క్షణాలు తనకీ తప్పనిసరని ఏనాడూ తెలీని ఆ పసికందు కాళ్ళు తేలిపోతుంటే వెక్కిపడుతూ చివరగా అన్నాడు "వెళ్ళిపోతున్నానమ్మా! అమ్మ ముద్దుపాట పాడుకుంటూ నిద్రపోతా నన్నమాట."

నానీ వెనుదిరుగుతుండగా ద్వారం తెరుచుకుంది.

ఆశగా నిలబడిపోయాడు ఆ చప్పుడికి.

ద్వారం దగ్గర నిలబడిన యువతి అమ్మలా లేదు. కాని ఆ పసిబిడ్డ పిలుపికి అమ్మ ప్రేమ కదిలిన ఆడదానిలా వుంది.

బడలికగా అంతదాకా ఆమె ఎదురు చూస్తున్నది విటుడి కోసం. కాని నటుడు ప్రత్యక్షమయ్యాడు చిత్రంగా.